
సాక్షి గుంటూరు

గురువారం, 19, డిసెంబర్, 2024




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. మిగిలిన కాలువలకు కూడా నీటిని విడుదల చేశారు.



దుర్గమ్మ ఆదాయం రూ.3.68 కోట్లు

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామికి భక్తులు హుండీల ద్వారా రూ.3.68 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 579.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఎన్జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో దూరవిద్యా కేంద్రం ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను జనవరి నుంచి ప్రారంభించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల పంట సాగు యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి కోర్సులు 8 వారాల పాటు 2 నెలల వ్యవధిలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. తప్పనిసరిగా ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్, ఆండ్రాయిడ్ సెల్ ఫోన్, ఐపాడ్ వంటి వాటిలో ఏదో ఒకటి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగలవారు జనవరి 3వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. 90632 19959, 83096 26619, 80960 85560 ఫోన్ నంబర్లను ఉదయం 9 – రాత్రి 7 గంటల వరకు చేసి సంప్రదించవచ్చని తెలిపారు.

యువతను ప్రోత్సహించేలా ఉత్సవాలు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22వ తేదీలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా వీవీఐటీ 2కె 24–25 నిర్వహించనున్నట్లు బుధవారం వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వరల్డ్ ఈజ్ వన్ పేరిట ఈ యువజనోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలో విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యం వెలికితీసేలా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాలలో 93 అంశాలలో పోటీలు ఉంటాయని వివరించారు. వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు పాల్గొన్నారు.

ఆరోపణలపై విచారణకు కమిటీ నియామకం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్‌పై ఆ విభాగ పరిశోధకురాలు చేసిన ఆరోపణలపై విచారణకు నలుగురు సభ్యులతో కమిటీని నియమించామని వీసీ ఆచార్య కె. గంగాధరరావు తెలిపారు. రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై. అశోక్ కుమార్‌లను కమిటీ సభ్యులుగా నియమించామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో యువకుడి ప్రతిభ



సత్తెనపల్లి: జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన యువకుడు ప్రతిభ కనబరిచి జాతీయ రికార్డ్ సాధించటంతోపాటు బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నాడు. ఢిల్లీలోని కర్ణాలి సింగ్ స్టేడియంలో జరుగుతున్న ఫెడరేషన్ కప్ మెన్–ఉమెన్ ఎక్విప్డ్ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 16 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్నాయి. ఈ పోటీలలో రాష్ట్ర జట్టులో సత్తెనపల్లికి చెందిన క్రీడాకారుడు పసుపులేటి వంశీకృష్ణ ప్రతిభ కనబరిచాడు. డెడ్‌లిఫ్ట్‌లో 297.5 కేజీలు ఎత్తి వంశీకృష్ణ సరికొత్త జాతీయస్థాయి రికార్డు సృష్టించాడు. జూనియర్స్‌లో 74 కిలోల విభాగంలో మొత్తం 680 కేజీలు ఎత్తి బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నాడు. త్వరలో జరగనున్న ఆసియా, యూఎస్ఏలో జరగనున్న వరల్డ్ చాంపియన్ షిప్ పోటీలుకు అర్హత సాధించాడు. వంశీకృష్ణను పవర్ లిఫ్టింగ్ పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ పసుపులేటి సురేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిమ్ రాజు, తిరుమలశెట్టి శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

సాహిత్య శిఖరాన అభ్యుదయ దీపిక



- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక
- లక్ష్మీనారాయణ స్వగ్రామం పాతచెరుకుంపాలెం
- గ్రామస్తుల హర్షాతిరేకాలు



చెరుకుంపాలెంలో లక్ష్మీనారాయణ నివసించిన ఇల్లు

పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం

సాహిత్య శిఖరాన వినుకొండ కీర్తిబావుటా రెపరెపలాడింది. ఈ ప్రాంత వాసికి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం దక్కింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు వినుకొండ ప్రాంతంలోని నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెం గ్రామ వాసి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. కవి సామ్రాట్ గుర్రం జాషువా తర్వాత సాహిత్య లోకంలో వినుకొండ ఖ్యాతిని చాటిచెప్పిన ఘనత లక్ష్మీనారాయణకు దక్కుతోందనడంలో అతిశయోక్తి లేదు.


వినుకొండ(నూజెండ్ల): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక కావడంపై వినుకొండ ప్రాంతంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన స్నేహితులు, పాతచెరుకుంపాలెం గ్రామస్తులు ఈ అవార్డు తమ గ్రామానికి దక్కినట్టుగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1954లో పాత చెరుకుంపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు రెండో సంతానంగా లక్ష్మీనారాయణ జన్మించారు. తండ్రి అదే గ్రామంలో బ్రాంచ్ పోస్టు మాస్టారుగా, గ్రామ మునసబుగా సేవలందించారు.

విద్యాభ్యాసం

1 నుంచి ఐదో తరగతి వరకూ చెరుకుంపాలెంలోనే లక్ష్మీనారాయణ ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. తరువాత 6 నుంచి 10వ తరగతి వరకూ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్ వినుకొండ ప్రభుత్వ కళాశాలలో, ఉన్నత చదువులు గుంటూరులో పూర్తిచేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో..

వినుకొండ మాజీ ఎమ్మెల్యే పులుపుల వెంకట శివయ్య ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు వేసి అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలు అందించారు. ప్రస్తుతం అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఈ సంఘం అధ్యక్షులుగా పనిచేస్తున్న తొలి తెలుగు వాడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ప్రస్తుతం లక్ష్మీనారాయణ గుంటూరులో స్థిరపడ్డారు. ఆయన రచించిన సాహిత్య వ్యాస సంపుటి దీపికకు ఈ అవార్డు లభించడం విశేషం.



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సంపుటి

స్నేహితుడిగా ఆనందంగా ఉంది



నేను, లక్ష్మీనారాయణ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాం. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి కలిగిన లక్ష్మీనారాయణ తరువాత లా వరకు చదివి సాహిత్యంపై ఆసక్తితో ఆ రంగంలోకి వెళ్లారు. అనేక కవితలు రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం గర్వకారణం. అతను నా స్నేహితుడు కావడం ఎంతో ఆనందంగా ఉంది.

దగ్గుబాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, పాతచెరుకుంపాలెం

కలిసి చదువుకున్నాం



లక్ష్మీనారాయణ, నేను కలిసి చదువుకున్నాం. చిన్నతనం నుంచి చురుకుగా ఉండే లక్ష్మీనారాయణ సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం మా గ్రామానికే గర్వకారణం. ఉన్నత చదువులు చదువుకుని అవార్డు అందుకోవడం అందరికీ ఆదర్శం.

– సూరెనాసర్‌రెడ్డి, పాతచెరుకుంపాలెం

ఆప్యాయంగా పిలుస్తారు



మేం ఇద్దరం పాతచెరుకుపాలెంవాసులమే. చిన్నతనం నుంచి మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. లక్ష్మీనారాయణ నన్ను అరే రామయ్య అని ఆప్యాయంగా పిలుస్తారు. కేంద్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డు రావడం మా గ్రామానికే గర్వకారణం.

జెడ్డా సుబ్బులు రామయ్య, జెడ్పీటీసీ, పాత చెరుకుంపాలెం

అభినందనలు



వినుకొండ ప్రాంతవాసి అయిన లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం గర్వకారణం. వినుకొండ ప్రాంతం కవులకు కళాకారులకు పుట్టినిల్లు. ఈప్రాంత కవిగా ఆయనకు అభినందనలు.

– కవికరీముల్లా, వినుకొండ, ఉపాధ్యాయుడు, కవి

ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం



లక్ష్మీనారాయణ చిన్నతనం నుంచి మిత్రుడు. ఫిరంగిపురంలో ఇద్దరం కలిసి చదివాం. ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం. ఆనందంగా ఉంది.

– వై.శేషగిరిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు

జీజీహెచ్‌లో పోస్టుల భర్తీకి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు రోగులకు అందించేందుకు ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర యశస్వి రమణ తెలిపారు. 'సాక్షి'లో బుధవారం 'అత్యవసరం ... అత్తెసరే..!' శీర్షికతో ట్రామాకేర్ సెంటర్‌లో ఖాళీ పోస్టుల గురించి, క్యాజువాల్టీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో రోగులు పడుతున్న బాధల గురించి కథనం ప్రచురితమైంది. దీనిపై సూపరింటెండెంట్ స్పందించారు. పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులను అనుమతి కోరుతామన్నారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌ను ఆధునికీకరించి వారం రోజుల్లోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

టెన్త్ విద్యార్థుల వివరాలు సవరణకు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థుల హాల్ టిక్కెట్లలో తప్పులు దొర్లకుండా వివరాలను సరి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత పాఠశాల రికార్డులతోపాటు, అపార్ ఐడీని అనుసరించి ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు తమ లాగిన్ ద్వారా సరి చేసుకోవాలని సూచించారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ సవరణ, ప్రథమ, ద్వితీయ భాషల ఎంపిక, మీడియం, అంగ వైకల్యం, ఓఎస్సెస్సీ సబ్జెక్టులు, కోడ్ ఆఫ్ స్టూడెంట్స్, టెన్త్ పరీక్షల ఒకేషనల్ సబ్జెక్టులు, పుట్టుమచ్చలు, విద్యార్థి ఫొటో, సంతకానికి సంబంధించి ఇటీవల సమర్పించిన నామినల్ రోల్స్‌లో తేడా ఉన్నట్లయితే సవరణ చేసి, హాల్ టిక్కెట్లలో తప్పిదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దళారుల దందా..!

- డబ్బు ఇస్తే ఉద్యోగాలిప్పిస్తామని వల
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులే ఎర
- ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు
- కింది స్థాయి ఉద్యోగులదే కీలక పాత్ర



డీఎంహెచ్ఓ కార్యాలయం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కొందరు దళారులు తిష్టవేశారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులకు మాముళ్ల జబ్బు సోకింది. ఈ స్వార్థపరులు ప్రతి పనికి రేటు నిర్ణయించి ముక్కుపిండి మరీ వసూలు చేస్తూ కార్యాలయ పరువు మంటగలుపుతున్నారు. ఇప్పటికే ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ కోసం, కార్యాలయం పరిధిలోని వైద్యులు, వైద్య సిబ్బంది సర్వీస్ విషయాలకు రేట్లు ఫిక్స్ చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. తాజాగా అక్టోబర్ నెలలో విడుదల చేసిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు గాలం వేసి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగానికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేయటం చర్చనీయాంశంగా మారింది.

అక్టోబర్‌లో నోటిఫికేషన్....

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు అక్టోబర్ 10న నోటిఫికేషన్ విడుదల చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు–3, ఫార్మాసిస్టు ఉద్యోగాలు–11, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు –11, శానిటరీ అటెండర్ ఉద్యోగాలు –15 చొప్పున మొత్తం 40 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఏడాదిగా నోటిఫికేషన్ లేకపోవడంతో ఇప్పుడు వేల మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకుని, ఫోన్స్ కూడా చేయిస్తున్నారు. ఉద్యోగాలకు పోటీ పడేవారి సంఖ్య వేలల్లో ఉండటంతో కార్యాలయంలో కొంత మంది ఉద్యోగులు వారికి గాలం వేస్తున్నారు. కాంట్రాక్ట్, నాలుగవ తరగతి ఉద్యోగులు ఈ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే వ్యక్తి బంధువు ఉద్యోగానికి దరఖాస్తు చేయటంతో సదరు వ్యక్తికి రూ.4 లక్షలు ఇస్తే ఉద్యోగం వస్తుందని దళారులు ఫోన్ చేసి చెప్పటంతో వారి దందా వెలుగులోకి వచ్చింది. గతంలో కార్యాలయంలో పనిచేసి ఇతర కార్యాలయాలకు పదోన్నతిపై వెళ్లినవారు, గతంలో ఉద్యోగాల సమయంలో వసూళ్లకు పాల్పడిన ప్రైవేటు వ్యక్తులు సైతం నేడు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నిరుద్యోగులను నిలువునా ముంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబ్బులు అడిగిన వారిపై చర్యలు



డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే, ఆ విషయం తన దృష్టికి వస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని వెల్లడించారు.

– డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

శరీరదానం చేసిన దంపతులకు అభినందనలు



మంగళగిరి: శరీరదానంలో ఈమని వెంకటరెడ్డి, శారద దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఈ దంపతులు శరీరాన్ని దానం చేస్తూ ఎయిమ్స్ ఆసుపత్రికి పత్రం రాసిచ్చారు. బుధవారం అఖిల భారత శరీర, అవయదాన సంఘం, బుద్ధ విహార ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి రేఖా నర్మద, బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న అక్రమ లేఅవుట్‌లు



నందివెలుగు రోడ్డులో లేఅవుట్‌ను జేసీబీతో పైపైన ధ్వంసం చేస్తున్న దృశ్యం



రెండు రోజుల తర్వాత అదే లేఅవుట్‌ను రోడ్డు రోలర్‌తో సరి చేస్తున్న దృశ్యం

- మామూళ్లతో చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- ఫిర్యాదులు వస్తే స్పందించినట్లుగా నాటకాలు
- కొందరు ప్రజాప్రతినిధులకూ అందుతున్న వాటాలు
- ప్రైవేట్ వెంచర్లకూ జీఎంసీ ద్వారానే సకల వసతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: రాజధాని ప్రాంతమైన గుంటూరు నగరంలో ప్లాట్ కొనుగోలు చేసేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. ఇదే అవకాశంగా రియల్టర్లు నగర శివారు ప్రాంతాల్లో లేఅవుట్లు ఇబ్బడి ముబ్బడిగా వేస్తున్నారు. దీనికి నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరి. చాలామంది రియల్టర్లు అనుమతి తీసుకోకుండానే లేఅవుట్లు వేస్తున్నారు. నగర పరిధిలో ఎక్కడైనా అనధికారిక లేఅవుట్ వేస్తున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాల్సిన పట్టణ ప్రణాళిక అధికారులు మాత్రం రియల్టర్ల నుంచి భారీ స్థాయిలో ముడుపులు తీసుకుంటున్నారు. దీంతో అనధికార లే అవుట్ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాలైన నల్లపాడు, పలకలూరు, లాల్‌పురం, నంది వెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో లే అవుట్స్ అధికంగా వెలుస్తున్నాయి. లేఅవుట్ వేయాలంటే సదరు ప్రాంతంలో ప్రతి వీధిలో 40 అడుగుల రోడ్డు ఉండాలి. (కొత్తగా వచ్చే ఆదేశాల్లో దీన్ని మార్పు చేసే అవకాశం ఉంది.) అదే విధంగా ఎకరం స్థలంలో అంటే 4,800 గజాల్లో పది శాతం అంటే.. 480 గజాలు పార్కు, ప్లే గ్రౌండ్, ఇతర ప్రజా ప్రయోజనాల కోసం వదిలిపెట్టాలి. మిగిలిన స్థలంలో ప్లాట్లు వేసి విక్రయించుకోవాలి. సెక్యూరిటీ డిపాజిట్ కింద చదరపు మీటర్‌కు రూ.3 వేల వంతున నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతోపాటు లేఅవుట్‌లలో కరెంట్ స్తంభాలు, తీగలు, లైట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. నాలుగున్నర ఎకరాల పైబడిన లే అవుట్‌కి అయితే ప్రత్యేకంగా రిజర్వాయర్‌ను నిర్మించాలి. కానీ నగరంలో ఏర్పాటు చేసే చాలా లేఅవుట్‌లలో ఎక్కడా ఈ నిబంధనల అమలు మచ్చుకైనా కనిపించదు. నగరంలో సుమారు వంద వరకు అనధికార లేఅవుట్‌లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ఫిర్యాదులొస్తే ఫోజు..

అనధికార లేఅవుట్‌లపై ఫిర్యాదులు రానంత వరకు ఎటువంటి చర్యలు ఉండవు. ఫిర్యాదు చేస్తే.. టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీ సాయంతో సదరు లేఅవుట్‌కు వెళ్లి కాసేపు హడావుడి చేస్తారు. హద్దు రాళ్లు తొలగించి ఏదో పెద్ద పని చేశామని షో చేయడంలో వారు సిద్ధహస్తులనే చెప్పవచ్చు. ఫిర్యాదుదారుడికి ఆ లేఅవుట్‌ను ధ్వంసం చేసినట్లు ఫొటోలు చూపడం మామూలైంది. తిరిగి ఆ లేవుట్‌లో యథావిధిగా పనులు చేసుకోమని పట్టణ ప్రణాళిక అధికారులే సంబంధిత రియల్టర్‌కు చెప్పడం పరిపాటిగా మారింది. లేఅవుట్‌ను పూర్తిగా ధ్వంసం చేయకుండా.. పైపైన ధ్వంసం చేసినందుకుగాకు రియల్టర్ల నుంచి ముడుపులు తీసుకుంటున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ నెల 14న నందివెలుగు రోడ్డులో అనధికారిక లేఅవుట్‌గా గుర్తించి గుంటూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీతో రోడ్లు ధ్వంసం చేశారు. 16వ తేదీన అదే లేఅవుట్‌ను రోడ్డు రోలర్‌తో సరి చేయించారు.

ఇదీ.. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నిర్వాకానికి మచ్చుతునక. లేఅవుట్‌ను ధ్వంసం చేయడం అంటే రెండు చోట్ల రోడ్డుపై చిన్న గుంతలు తీసి ఫొటోలు తీసుకుని మీడియాకు పంపడం... రెండో రోజు లేఅవుట్ వేసిన రియల్టర్ వద్ద డబ్బులు తీసుకుని మళ్లీ లేఅవుట్‌ను పునరుద్ధరించుకునేలా చూడటం వారికి పరిపాటిగా మారింది. ఈ ఒక్క సంఘటన చాలు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎంత లంచాల మత్తులో మునిగి తేలుతున్నారో అర్థం చేసుకోవడానికి!

రూ.10 లక్షలకు పైగానే వసూలు

నగర పరిధిలో ఏర్పాటయ్యే అనధికార లేఅవుట్‌లలో ఒక్కో దాని నుంచి రూ.10 లక్షలు, ఆపైనే పట్టణ ప్రణాళిక అధికారులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా వాటా వెళుతోందని సమాచారం. లేఅవుట్‌కి అన్ని మౌలిక వసతులు రియల్టర్ కల్పించాల్సి ఉండగా... అవేమీ కల్పించకుండానే ప్లాట్స్ విక్రయించడం.. కొనుగోలుదారులు తర్వాత నగరపాలక సంస్థకు వినతి పత్రాలు అందజేసి సౌకర్యాల కల్పనకు విజ్ఞప్తి చేయడం పరిపాటిగా మారింది. దాని ప్రకారం మౌలిక వసతులు కల్పించాలని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తీసుకురావడం షరా మమూలైంది. దీంతో ప్రైవేట్ వెంచర్లకు కూడా నగరపాలక సంస్థ ద్వారానే సదుపాయాలు కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతిమంగా ప్రజాధనం ఇలా అధికారులు, ప్రజాప్రతినిధులు, రియల్టర్లు లూటీ చేస్తున్నారు. దీంతోపాటు 10 శాతం పార్కు తదితరాలకు కేటాయించాల్సిన స్థలాలను కూడా రియల్టర్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు మాయ



యనమదల మెయిన్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు



అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం 14 మందికి వేసిన హాజరు

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. సెక్టార్ సూపర్‌వైజర్లు కేంద్రాలకు చుట్టం చూపుగా తనిఖీలకు వెళుతుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరును ఇష్టానుసారంగా నమోదు చేస్తున్నారు. బోగస్ హాజరు వేస్తూ విధుల్లో అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ చిత్రాలు. ప్రత్తిపాడు మండలం యనమదల మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో నలుగురే నలుగురు చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మాత్రం రిజిస్టర్‌లో ఏకంగా పద్నాలుగు మంది 18వ తేదీన కేంద్రానికి హాజరైనట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో హాజరు వేసేశారు. ఇదేమని అంగన్‌వాడీ కార్యకర్తను 'సాక్షి' అడగ్గా.. పది మంది చిన్నారులు వచ్చారని, అందులో నలుగురు ఇప్పుడు ఉన్నారని, మిగిలిన వారు అన్నం తిని వెళ్లిపోయారని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **2,800**

మోడల్ ధర రూ. **2,400**

నారా లోకేష్ వైఖరి అభ్యంతరకరం

పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్



మాట్లాడుతున్న పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో మంత్రి నారా లోకేష్ మాట్లాడిన తీరు అభ్యంతరకరమని పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అన్నారు. బుధవారం బ్రహ్మానందపురంలో దీక్ష నిర్వహిస్తున్న కార్మికుల శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ లోకేష్ వద్దకు కార్మికులతో కలిసి వెళ్లామని చెప్పారు. సమస్యను వివరిస్తుంటే కనీసం వినడానికి కూడా మంత్రి సిద్ధపడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును ఉల్లంఘించి గుడిసెలను కూల్చిన యాజమాన్యానికి వత్తాసుగా మాట్లాడారని చెప్పారు. భూముల్లో గుడిసెలు ఎందుకు వేశారని కార్మికుల్ని ప్రశ్నించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఎందుకు మాట్లాడలేదని కార్మికులను ఎదురు ప్రశ్నించారని చెప్పారు. పదేపదే సమస్యను పరిష్కరించమని తన వెంట ఎందుకు పడుతున్నారని కార్మికుల్ని అడిగారని పేర్కొన్నారు. న్యాయం చేయవలసిన మంత్రి ఇలా మాట్లాడడం తమకు ఆశ్చర్యం కలిగించిందని వివరించారు. బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తి, మంగళగిరి ఎమ్మెల్యే అయిన లోకేష్ ఇలా మాట్లాడితే తమ సమస్యను ఎవరితో చెప్పుకోవాలని కార్మికులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు కె. ఆదినారాయణ మాట్లాడుతూ.. కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఉద్యమించాలని అన్నారు. ప్రభుత్వమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. అంకయ్య, ఎం. ఆశీర్వాదం, సూర్య ప్రకాష్, ఆర్. శివ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, గురవయ్య, శివమ్మ, దుర్గా భవాని, శారద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విచారణకు మాజీ ఎమ్మెల్యే రోశయ్య హాజరు



పొన్నూరు: సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు కేసులో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్య బుధవారం రూరల్ స్టేషన్‌లో రెండోసారి విచారణకు హాజరయ్యారు. తమపై కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులు 2020లో నియోజకవర్గానికి చెందిన 14 మంది నేతలపై పొన్నూరు రూరల్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా రోశయ్యను విచారణ చేసినట్లు రూరల్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

యార్డుకు 53,365 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 53,365 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,966 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 48,532 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం



తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్‌కు అనుసంధానంగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్‌లో బుధవారం సాయంత్రం ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. ఉండవల్లి సెంటర్ స్క్రూ బిడ్జి వద్ద ఆ మృతదేహాన్ని చూసి కొంత మంది పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 112కు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. మృతదేహం అలాగే కాలువలో కొట్టుకుంటూ వెళ్లిపోయింది.

హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకం

వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: హెల్త్ కేర్ రంగంలో ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకమని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ హెల్త్ కేర్ పరిశ్రమలో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ అవకాశాలు, సవాళ్లు' అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసంగిస్తూ.. హెల్త్ కేర్ రంగంపై అవగాహన పెంచుకుని మానవీయ విలువలతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కృత్రిమ మేధతో వైద్యరంగం వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ వైద్య రంగంలో పరిశ్రమలను స్థాపించే స్థాయికి అందరూ ఎదగాలని సూచించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. ఎం.సురేష్ కుమార్, నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ ఇన్సూరెన్స్ రాష్ట్రస్థాయి సలహాదారు పసల జ్యోతి, విభాగాధిపతి ప్రొఫెసర్ బి. నాగరాజు, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు జరుగుతాయని గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా జట్టు ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఏఐ గుర్తింపు పొందిన అండర్–18, 18 ఏళ్లపైబడిన వారు ఆయా కేటగిరీల్లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 70755 08842 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

20 నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రీడా పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో 'ఆదర్శ్ 2024' పేరుతో రాష్ట్ర స్థాయి అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడా పోటీలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు వేదిక అన్నారు. 20న క్రీడా పోటీలను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగ చైర్‌పర్సన్ పోడపాటి తేజస్విని ప్రారంభించనుండగా, 21న జరిగే బహుమతి ప్రదానోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, క్రీడోత్సవాల సమన్వయకర్త డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, సాంస్కృతిక విభాగాల సమన్వయకర్త కొల్లా సుస్మిత చౌదరి, కృష్ణార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం, ఆదాయం



అల్లూరు(కర్లపాలెం): ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు మనుషులు ఆరోగ్యంగా ఉంటారని హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరులో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రాం టీమ్ సభ్యులైన గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన 13మంది రైతులు సందర్శించారు. గ్రామంలో కెతోరా థెరీసా సాగు చేస్తున్న ఎనీ టైమ్ మనీ పంటల విధానాన్ని, కృపావతి సాగు చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్ వరిపైరు క్షేత్రాన్ని, వెంకటరెడ్డి సాగుచేస్తున్న మినుము పైరును, గో ఆధారిత ప్రకృతి వనరులతో సాగుచేస్తున్న సుబ్బారెడ్డి పెరటి తోటలను పరిశీలించారు. వీరికి హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, రైతు సాధికార సంస్థ థీమాటిక్ లీడర్ శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.శ్రీవాణి, అడిషనల్ డీపీఎం జె.మోహన్, మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం పెద్ద ఎత్తున దుమారం రేపుతోంది. ఈ సర్టిఫికెట్లతో వర్సిటీలో పీజీ కోర్సులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఇంటర్వ్యూల్లో గుర్తించిన స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మాజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్‌లు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ జరపాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణ స్వామిని వివరణ కోరగా.. వర్సిటీ నుంచి ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారుల అనుమతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మార్టూరులో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ పులి ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న తోటకూర నాగేశ్వరరావు (60) స్థానికంగా జరుగుతున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతి నుంచి గుంటూరు వెళుతున్న తమిళనాడుకు చెందిన కారు రోడ్డు దాటుతున్న నాగేశ్వరరావును ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం

కానూరు వాసిగా గుర్తింపు



నదిలో రామకృష్ణ మృతదేహం



బ్యాంకు పాస్ బుక్‌లోని ఫోటో

తాడేపల్లి రూరల్: కృష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతదేహాన్ని వెలికి తీశామని, ఒడ్డున ఏపీ 39 వీజే 9929 నెంబరు ఆటో నిలిపి ఉందని తెలిపారు. ఆటోను పరిశీలించగా రామకృష్ణ పేరుతో ఆధార్ కార్డు లభించిందని, దాని ఆధారంగా ఆ వ్యక్తిది కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు అని నిర్ధారించామని చెప్పారు. ఆటోలో బ్యాంక్ పాసు పుస్తకం, ఫోన్ లభించాయన్నారు. ఫోన్‌లో నెంబర్లను సంప్రదించగా ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదని, బ్యాంక్ పాసుపుస్తకంలో అడ్రస్, ఆటో సీ బుక్‌లో చిరునామాలు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. మూడు అడ్రస్‌లను పరిశీలించి రామకృష్ణ మృతికి కారణాలు తెలుసుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన



మాట్లాడుతున్న సత్యరావు

నగరంపాలెం: గుంటూరు, ప్రకాశం జిల్లాలోని న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై జిల్లా కోర్టు ఆవరణలోని హాల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈ క్రమంలో ది గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ నుంచి ఆర్.రత్నతార, సత్యరావు (తమిళనాడు)లు మాట్లాడారు. రానున్న రోజుల్లో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమయ్యేందుకు తొలి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. మధ్యవర్తిత్వం, రాజీ, లోక్ అదాలత్ అనేవి వేర్వేరు అని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి ప్రసంగించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనూరాధ, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: గ్రామ కంతాల రీ సర్వే మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు 234 గ్రామ పంచాయతీలకు డ్రోన్ ఫ్లై పూర్తి చేశామన్నారు. 16 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ కంతాల రీ సర్వే కూడా పూర్తయ్యిందని తెలిపారు. మరో 50 గ్రామాలకు సంబంధించి మ్యాప్‌లు వచ్చాయన్నారు. గ్రామాల్లో పంచాయతీ, సర్వే, రెవెన్యూ, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రీ సర్వేకు సంబంధించి ఎప్పటికప్పుడు మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో జేసీ ఎ.భార్గవ్ తేజ, జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, డీపీఓ సాయి కుమార్, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, ఎస్‌డీసీ అధికారి బిమల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు లక్ష్యసాధన ముఖ్యం

నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు లక్ష్యసాధన ముఖ్యమని, అందుకు కృషి, పట్టుదల, ప్రణాళిక అవసరం అని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల అంతర్ పాలిటెక్నిక్ జిల్లాస్థాయి ఆటల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను గౌరవ వందన స్వీకరించారు. జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షత వహించారు. అనంతరం కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు లక్ష్య నిర్దేశం అవసరం అని చెప్పారు. దాని సాధనలో అధ్యాపకుల బోధనలతోపాటు స్వీయ కృషి ప్రధానమని సూచించారు. కృషి, పట్టుదల, ప్రణాళిక మినహా షార్ట్ కట్‌లు ఉండవని స్పష్టం చేశారు. గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలన్నారు. 1993లో గ్రామ అభివృద్ధి అధికారిగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తాను ప్రస్తుతం ఐఏఎస్ అధికారిగా ఉన్నత స్థాయికి చేరడం వెనుక కఠోర శ్రమ ఉందని తెలిపారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ.. క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. ఈ కళాశాల బాలికల భవిష్యత్‌కు ఎంతో అండగా నిలిచిందన్నారు. విద్యార్థినులను చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి కమిషనర్ శ్రీనివాసులు, ఎంవీఐ రాఘవరావు చెరొక రూ.20 వేలు విరాళంగా అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 18 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అతిథులు వాలీబాల్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ టి.శేఖర్, ప్రభుత్వ టెక్స్‌టైల్ కళాశాల ప్రిన్సిపల్ శైలజ పాల్గొన్నారు.

సమన్వయంతో శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించిన క్షేత్ర స్థాయి పనులను ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్వోబీ నిర్మాణం కోసం రోడ్డు విస్తరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే అరండల్ పేట, బ్రాడీపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో, ఏఈఎల్‌సీ చర్చి, ఆర్‌సీఎం చర్చి ప్రతినిధులతో సమావేశమయ్యామని వివరించారు. సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. ఆర్వోబీ నిర్మాణం, సర్వీస్ రోడ్ మార్కింగ్ వంటి పనులను వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే జాయింట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాసమూర్తి, ఈఈ సి.విశ్వనాథరెడ్డి, డీఈఈ చిన్నయ్య, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

పెనుగొండ కృషి స్ఫూర్తిదాయకం

తెనాలి: గుంటూరుకు చెందిన సాహిత్యకారుడు పెనుగొండ లక్ష్మీనారాయణ 'దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాసాల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించటం అభినందనీయమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శి కె.శరచ్ఛంద్ర జ్యోతిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్య వికాసానికి తెలుగునాట చేస్తున్న కృషికి తగిన గుర్తింపుగా, అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. 1973లో సాధారణంగా మొదలైన పెనుగొండ ప్రస్థానం నేడు అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష స్థానం వరకు కొనసాగటం విశేషం. విలక్షణమైన విమర్శకుడిగా పెనుగొండ కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

- అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రకటనపై అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు హర్షం వ్యక్తంచేశారు.